# ఆ నాడు

**శ్రీ బొమ్మిరెడ్డి**

ఇంతకూ నేనా నాడు ధోవతీకట్టి లాల్చీతొడిగి కండువా వేసుకోడం నాది ప్రథమ తప్పు. ఆ తరువాత తెలంగాణా రచయితల సమావేశానికి హాజరై, ఆలస్యంగా పదకొండుగంటల రాత్రి నిర్జనమయిన మా సితాఫల్ మండి వీధుల్లో (ముల్కీ నాన్ ముల్కీ గొడవ బయలుదేరింతరువాత రాత్రి తొమ్మిది గంటలు దాటితే వీధుల్లో యెవరూ వుండటం లేదులెండి) ఒక్కడినే పడి రావడం రెండవపొరపాటు. సరే యెలాగో తప్పదుగా! అందులో హైద్రాబాద్ సంస్థానంలో పుట్టి పెరిగిన నన్ను నాన్‌ముల్కీ క్రింద జమకట్టరు కదా అన్న ధీమాతో బస్సుదిగి యింటిదారి పట్టాను, తొందర తొందరగా అడుగులు వేసుకుంటూ. మెయిన్ రోడ్డు దిగి ఒక వీధిలో జొరబడ్డానో లేదో పక్కనే కల్వర్టుమీద యెలక్ట్రిక్ దీపపు వెలుతురులో కూర్చున్న ఓ చిన్న గుంపు నాకంటబడ్డది. ఇంతకు ముందక్కడ మా స్నేహిత బృందమంతా హాజరయి యేదో పిచ్చాపాటి సాగిస్తూ వుండేవాళ్లం. ఇప్పుడా చోటనే ఒక పదిమంది విద్యార్థులు - యీ మధ్యనే *H. S. G* పాసయ్యారు లెండి వాళ్లంతా - ఏదో గొప్పగా చర్చిస్తున్నారు. ఒకళ్లకొకళ్లు మాట్లాడుకుంటున్నట్లు లేదు వాళ్ళ విధానం. కేకలు వేస్తున్నారు. మధ్య మధ్య నవ్వులు. నేనామూల మలుపు తిరగడంతోనే "ఏయ్ గైర్ వాలా", అన్న అరుపు వినబడింది. దాన్ననుసరిస్తూ "యే నాన్‌ముల్కీ సాలా" అన్న కేక వినిపించింది. ఆ తరువాత "ఓరే ఆంద్రా" అన్న కేక వినబడగానే నా కాళ్లెందుకో టక్కున ఆగిపోయాయి. ఒక్క క్షణం ఆలోచించాను. అక్కడున్నవాళ్ళందరూ తెనుగువాళ్లే. మరి వాళ్లు మాత్రం ఆంధ్రులు కారా? నన్నెకన్నారామాట? ఒక సమస్యనుండి యింకొక సమస్య యెలా బయలుదేరుతుందో ఆలోచించాను. ఈ మధ్య హైద్రాబాద్ పోలీస్ యాక్షను తరువాత ఇతర ప్రాంతాలవాళ్లు స్టేట్‌లోకి వచ్చిన మాట వాస్తవమే. అందువల్ల నిరుద్యోగ సమస్య మరీ విషమించింది. కాని ఆవచ్చిన గైర్లందరూ ఆంధ్రులుకారు. కాకపోతే తెలుగుదేశాలనుండి వచ్చినవారు యెక్కువమంది వున్నారేమో! అయినంతమాత్రాన నాన్‌ముల్కీలనగానే ఆంధ్రులన్న నిర్ధారణకొచ్చి, ఆంధ్రుల్ని, ఆడిపోసుకోడం వుచితం కాదుగా? అందులో హైద్రాబాద్ తెలుగువాళ్లు, బయటనుండి వచ్చిన తెనుగువాళ్లను, "ఒరేయ్ ఆంద్రా" అనడం సబబునది కాదు. అలా అంటున్నారంటే వాళ్లు ఆంధ్రులు కారన్న మాటేగా మరి! అయినా వాస్తవికానికి వారు ఆంధ్రులే! ఈ విషయంలో ఆలోచించినకొద్దీ వాళ్ళ తెలివి చావుతెలివిగా మారుతుందన్న భావం దృఢపడింది నాలో. వాళ్లకు అసలు విషయమేమిటో, అసలీ సమస్య యెలా బయలుదేరిందో, దీన్నెలా పరిష్కరించాలో వారికి నచ్చజెప్పాలనుకున్నా. అనుకోడమేమిటి నిశ్చయించుకున్నాను. వెనుతిరిగి వాళ్లవేపు నడిచి వెళ్లాను. నేను దగ్గరికి రావడం చూచి వాళ్ళందరూ తలలు వాల్చేశారు. ఎవరూ మాట్లాడలేదు. నేను కూడా యీ విషయాన్ని ముందెలా యెత్తుకోవాలని ఆలోచిస్తున్నాను. ఇంతలో ఒకడు లేచి "క్షమించండి సార్ ఎవరో గైర్‌గా డనుకున్నాము. పొరపాటు. వెరీ సారీ" అన్నాడు.

"అది కాదోయ్ అసలు..." అని నేను మొదలుపెట్టేటప్పటికి యింకొకడు లేచి "పోనీయండి సార్. తప్పు మాదే" అంటూ సగందూరం నెట్టుకొచ్చాడు నన్ను. వాడి మోటుతనం చూచి యిక మాట్లాడే ధైర్యం లేకపోయింది నాకు. మెల్లిగా నడవసాగాను. వెనుకనుండి పెద్దగా నవ్వులు వినిపించాయి. వళ్లు మండిపోయింది. కాని వాళ్లతో వాదించి లాభముండదని భావించి మెల్లిగా రోడ్డు కొలుచుకుంటూ నడవసాగాను.

నా బుర్రలో ఆలోచనలు పలు విధాలుగా పరిగెత్తుతున్నాయి. ఒకవెపు విశాలాంధ్ర కావాలన్న నినాదం. ఇంకొకవైపు విశాలాంధ్రలో ఒకభాగం కానున్న హైద్రాబాదులో ముల్కీ, నాన్ ముల్కీ గొడవ. అందులో నాన్ ముల్కీలంటే తెనుగుదేశాలనుండి వచ్చిన వారేనని భావించి "*Non-Mulkies go back*" అని ముందు గోడలమీద రాసి, యిప్పుడు "*Andhras go back*" అని గోడలు ఖరాబు చేస్తున్నారు. ఆంధ్రులందరూ కలిసి ఐక్యకంఠంతో ఆంధ్రరాష్ట్రం కావాలంటేనే అది తొందరలో ప్రాప్తిస్తుంది అంటున్నారు. నెహ్రూగారు రాయలసీమలో యీ విషయమై కొంత రభస జరుగుతూ వుంది. ఇక హైద్రాబాద్‌లో కూడా ఒకటి బయలుదేరదు కదా? అలా జరిగితే రాష్ట్ర విభజన తొందరలో సిద్ధిస్తుందా? నా ఆలోచనలకొక్కసారిగా అంతరాయం కల్గింది.

మెరుసుకుంటూ యెదురుగా వచ్చి నిలవేసింది నన్ను ఓ కుక్క. ముందడుగు వేస్తే యెక్కడ కాటేస్తుందో అన్న భయంతో ఆగిపోయాను. యెదురుగా ఫోకస్ చేసిన టార్చిలైటు కాంతి నాముఖంమీద పడ్డది. కళ్లు అమాంతంగా తమ ధర్మాన్ని నెరవేర్చడం మానుకొన్నాయి. ఏమీ కనిపించటంలేదు. కళ్లు మూసుకున్నాను. పోలీసువాడెవడయినా గస్తీ తిరుగుతూ వంటరిగా వస్తున్న నన్ను శంకించి అలా చేశాడేమో? కాని అదేమిటి ముఖం మీద వేయడం దేనికి? వాడు దగ్గరికొచ్చి ప్రశ్నించినప్పుడు అంతు కనుక్కోవాలనుకున్నాను. ఒక ఘరానా వ్యక్తిమీద టార్చి వేయడం సామాన్యవిషయం కాదు. చాలా అవమానకరమైనది. అది మర్యాద కాదు. ఇంతకూ వాడు పోలీసువాడై వచ్చేదెవరో తెలుసుకోవాలనుకుంటే రోడ్డుమీద టార్చి వేసి చూడాలికాని ముఖంమీద కాదు. నా కళ్లు పనిచేయకపోయినా చెవులు మాత్రం వాటి ధర్మాన్ని అవి నెరవేరుస్తున్నట్టున్నాయి. నా వైపుకే నడిచివస్తున్న వాళ్ళ అడుగుల చప్పుడు వినవస్తూ వుంది. కళ్లు గట్టిగా మూసుకునే వున్నాను. అడుగుల చప్పుడు దగ్గరవుతున్నట్లు చెవులు మెద

(55-వ పేజీ చూడండి)

# ఆ నాడు

(8-వ పేజీ తరువాయి)

డుకివార్త లందిస్తున్నాయి. ఒకళ్లిద్దరూ కాదు, పదిమంది నడిచివస్తున్నట్లుంది.

నా వీపుమీద చరుపు పడ్డది. ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూచాను. నా యెదుట వున్న ఆకారాలు మసక మసకగా కనిపిస్తున్నాయి. అద్దాలు తీసి కళ్లు నులుముకొని చూడాలనుకున్నాను. అద్దాలు తీస్తూవుండగానే యెవరో దాన్ని లాక్కున్నారు. నాకేమీ తోచిరాలేదు యీ చర్య. నా యెదుట వున్నవాళ్లు పోలీసులు మాత్రం కారు. కళ్లు నులుముకొని చూడక తప్పింది కాదు. యెదుట "జగ్గు" ప్రత్యక్షంగా కనిపిస్తున్నాడు. ఈ జగ్గు యెవరో నేను బాగా యెరుగుదును. పోలీసు యాక్షనుకు ముందు కనబడకుండా మాయమై, ఆతరువాత బయటపడిఅప్పటికి చచ్చిన పాముల్లా అనిపించుకున్నవాడు. వున్న ముస్లిములను తన్ని "వీరరౌడి". వాడు కూడా నన్నెరుగును. అయితేమటుకేం మెడమీద చెయ్యేసి కండువా లాగేసుకున్నాడు. నాకు వీళ్ళచర్యలు అర్థం కావటంలేదు. అందరూ గూండాగిరికి దిగినట్లున్నారు. మొత్తానికి వాళ్ళందరూ మా బస్తీలో బేవారసులుగా తిరిగేవారే! ఒకడు కళ్ళద్దాలు లాగేశాడు. వీడేమో కండువా తీసేశాడు. ఏమిటీ వ్యవహారం? నావళ్లు వణుకెత్తింది. కోపం కుతికెలవరకొచ్చింది.

"ఏమిటి జగ్గూ యిదంతాను" అని అడిగాను ఉండబట్టలేక.

"నోరు మూయరా ఆంధ్ర......" అన్నాడొకడు తన హైద్రాబాద్ వుచ్చారణకు కృష్ణాజిల్లా వుచ్చారణ పదును పెడుతూ వెక్కిరింతగా.

"ఏమిటీ దౌర్జన్యం...ఇదితగదు... అన్యాయం. తెలిసిన నన్నే యిలాచేస్తే యితరులగతేమిటి...ఏమిటి జగ్గూ యిదంతాను." అన్నా-తిరిగి ఒకేటుక్కులో.

"జర వుండుసార్ సెయ్యిమీద వజన్ తగ్గిసామ్" అన్నాడొకడు.

"గైర్ సాలే గాండ్లు పోకపోతే అందర్కి యిదే. తన్నులు." అన్నాడొకడు. యిక నాస్థితి వేరే చెప్పాలా! రెండు పిడిగుద్దులు నా వీపుమీద పడ్డాయి.

అటు నలుగురూ, ఇటు నలుగురు కలిసి నా రెక్కలను విరిచి పట్టుకున్నారు. చేతి గడియారం, వుంగరం లాక్కున్నారు. జేబులు తడిమిచూచారు. ఏమీలేదు. వున్న చిల్లర ఖాళీచేసేశారు. ఇక నేనుమాత్రం మిగిలాను. వాళ్లు వుంగరం తీస్తున్నప్పుడూ, గడియారం విప్పుతున్నప్పుడూ గింజుకున్నందుకు, తన పిడికిలిలో నాలాల్చీని చిక్కించుకొని గుండెలకదిమిపట్టి యెదురుగానిలుచున్న జగ్గు చేతుల్లో, నా సిల్కులాల్చీ చినిగి పేలికలయింది. మెడపట్టికున్న పార్కరుకలం క్రిందపడ్డది. అంతే. యిక అదికూడా నాకు కనబడకుండా పోయింది. చివరికి నా ధోతినికూడా లాగేశారు. బనియను, డ్రాయరు, పైన చినిగిన పేలికలు వేలాడుతున్న లాల్చీతో నేను మాత్రం మిగిలాను.

"ఛోడ్ రె సాలేకూ" అన్నాడు జగ్గుచివరకు నన్ను వదులుతూ. చేతులు పట్టుకున్న వాళ్లు వదిలేసి వెనక్కితగ్గారు.

లోపల హృదయం మండిపోతూవుంటే:

"అంతా గూండాలు. లుచ్చాలు...నిలువునాపిడి, కేవలం పనిచేయడం చేతకాక బేవారసు లందరూ కూడి పొట్టపోసుకోడానికి ప్రజలను దోచుకోడానికి పన్నిన పన్నాగం యీ ముల్కీ నాన్ ముల్కీ గొడవ అంతానూ."అని అనకుండా వుండలేకపోయాను. అంతే. కళ్లు మళ్లీ మూసుకపోయాయి. తిరిగి కళ్లు తెరిచి చూచేటప్పటికి శ్వేతాంబర ధారియయిన హాస్పిటల్ నర్సు ప్రత్యక్షమయింది నగు మొగముతో. అంతే. ★

# కాలక్షేపం

(7-వ పేజీ తరువాయి)

తృప్తి కలుగదు. ఆ తమలపాకులకు అనేక పరిమళద్రవ్యాలు అనుపానంగా కావాలి. పిటివక్కలు, లవంగాలు, ఏలకాయలు జాపత్రి, జాజికాయలు, పచ్చకర్పూరం, చలువమిరియాలు, కాచు, ఎండుకొబ్బరి కూడా కావాలి. నాలుక ఎర్రగా పండిందో లేదో చూచుకొనడానికి నిలువుటద్దాలు కావాలి. తాంబూలచర్వణానంతరం కొంచెం తిక్కగాఉంటే నడుము వాల్చి పరుండుటకు పరుపులు పందిరిమంచాలు కావాలి. పంకాలు, వింజామరాలు, విరజాజి పూల బంతులు కావాలి. ఇంకా చెమటపోస్తూ ఉంటే, సన్నని రవసెల్లాలు, బంగారు జరీచీరెలు, పట్టురవికెలు కావాలి. ఆ చీరెకు పసందైన బంగారుగజ్జలవడ్డాణం, దానికి యీడుజోడైన యితర కెంపుల రత్నాల ఆభరణాలు కావాలి. అగరువత్తులు సువాసన తలనూనెలు, సెంటుసీసాలు, గంధం, పన్నీరు వగైరాలతో తాపం చల్లారకపోతే సినిమా ప్రదర్శనాలకు వెళ్ళి బాక్సులో భద్రాసనం స్వీకరించి, కథపట్టులో అయిస్ క్రీం వగైరా హిమపాయసం సేవించాలి. షర్బత్తులు ద్రాక్షారసాలు కూడా కావాలి.

దీనితో ఉగ్రమావులంటివాళ్ళూ కూడా ఉల్లాసీదా అవుతారు. పాదుషాలు కూడా పైగంబరులవుతారు. లేత తమలపాకుల మేతఅంటే అది దేవికి లంకమేత. దేవరకు ఏటియాత.

హరితతృణాగ్రముల్ మెసవి
యంబర వీథిని గ్రేళ్లుదాటు మేల్
హరిణచయంబు; నృత్యసమ
యస్ఫుట పింఛము లౌమయూరముల్."

(హరితతృణాగ్రముల్) దర్భగడ్డికొనలు మెసవి, (అంబరవీధిని) ఆకాశవీధిలో (గ్రేళ్లుదాటు) గంతులువేయు మేలైన (హరిణచయంబు) లేళ్ళసమూహమున్ను నృత్యసమయానికి పింఛములు విప్పి ఆడేటి నెమళ్లున్నూ విహరించేటటువంటి కానన సీమలో ఆశ్రమం ఉంటే చాలా ఖులాసాగా ఖుషీగా హుషారుగా ఉంటుంది. అటువంటిచోట ఏర్పాటుచేసికొనిన కణ్వాశ్రమంలోనికి మేనక అనే గంధర్వాంగన ప్రసవించి విడిచిపెట్టిన శకుంతల చేరింది. ఆపిల్ల అక్కడే పెరిగి పెద్దమనిషి అయింది. ఒక లేడిపిల్లను కూడా ఆశకుంతల పెంచింది. ఆమెకు చెలికత్తెలుగా అనసూయ, ప్రియంవద అనేవాళ్లు తయారైనారు. ఒక లేడిపిల్లను పెంచుకుంటూ అడవిలో కాలక్షేపం చేస్తున్న కణ్వమహర్షి ఆశ్రమంలోకి లేడిపిల్లలతో పాటు ఆడపిల్లలు కొందరు చేరి చాలా పెద్దనాటకం ఆడినారు. దానినే శాకుంతల నాటకం అంటారు.

మహర్షికి ఒక ఆశ్రమం. బావాజీకి ఒక మఠం. సన్యాసికి ఒక పీఠం. ఈ మఠానికి, ఆ పీఠానికి భక్తులిచ్చిన కానుకలతో కొంత స్థిరాస్తి. అదంతా ఒక ధర్మాదాయం, ఒక ఎస్టేటు అవుతుంది. ఈ ఎస్టేటుకు ఏనుగులు, లొట్టిపిట్టలు, గుర్రాలు, గుమాస్తాలు, దాసదాసీపరివారజనం చేరుతాయి. స్వాములవారిగోచీ ఉతికిఆరబెట్టితే రాత్రిళ్లు ఎలుకలు ఆగోచీని కొరికివేయడం ప్రారంభించాయి. ఎలుకలను చంపడానికొక పిల్లిని పెంచాడు. పిల్లికి పాలు కావాలని ఆవు - దానికి గడ్డి కావాలని పొలం - పొలంకోసం పాలేర్లు, ధాన్యంకొట్లు, గుమాస్తాలు, చిఠాలు, అవర్జాలు, తాణా ఆఫీసు ఏర్పడ్డాయి. సర్వసంగపరిత్యాగికి ఏమిటీ యీజంజాల పటలం, యీపటాలం అంటే, "కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః" అన్నాడు. గోచీ సంరక్షణకోసమే యీ ఆడంబరం అంతా అన్నాడు.

కనుక, అయోధ్యలో ఉన్నా, అడవిలో ఉన్నా, మాయలేడీ వ్యామోహం లేకుండా నళినీదళగతజలము వలె ప్రవర్తిస్తే, చక్కగా, శాంతంగా కాలక్షేపం చేయవచ్చు. ★